క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడికి నివాళి



నాయకుడు సోమలింగం పడాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలం పెదవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కంకిపాటి సోమలింగం పడాల్‌కు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి కార్యక్రమం శనివారం పెదవలస గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ మత్స్యరాజు, నాయకుడు గిరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మందులు తప్పనిసరి

అనంతగిరి(అరకులోయటౌన్): నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరూ నులిపురుగుల మందు తప్పనిసరిగా వేసుకోవాలని ఎంపీడీవో కుమార్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఏడాదిలో రెండు సార్లు నులిపురుగుల మందు వేసుకోవాలన్నారు. ఈనెల 10న ప్రభుత్వం ఈ మందులు వేసుకునే కార్యక్రమం ప్రారంభించనున్నట్టు చెప్పారు. 3 సంవత్సరముల నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలందరూ నులిపురుగుల మందు వేసుకుంటే ఆరోగ్య సమస్యలు దరి చేరవన్నారు. ఒక ఆరోగ్య సమస్యలతో బాధ పడేవారు వైద్యుల సూచన మేరకు ఈ మాత్రలు వేసుకోవాలని కోరారు. ఈనెల 17 నుంచి ఈ మాత్రలు అందుబాటులోకి వస్తాయన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న పిల్లలకు నులిపురుగు మందులను వేయించాలని ఎంపీడీవో కుమార్ కోరారు.

ఆధ్యాత్మికత భావంతో మానసిక ప్రశాంతత



స్వామి వారికి పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

గూడెం కొత్తవీధి: ఆధ్యాత్మికత భావంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని పాడేరు ఎమెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని పెదవలస గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న బోదేశ్వరస్వామి తీర్థ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలని కోరారు. గ్రామంలో ఉత్సవాలు శనివారం నుంచి నాలుగురోజులపాటు జరగనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా సీఎం అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న గిరిజన మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయ

ముంచంగిపుట్టు: ఒడిశా రాష్ట్రం సీఎం మోహన్‌చరణ్ గిరిజన మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఆదివాసీ గిరిజన మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయలు ధ్వజమెత్తారు. ఒడిశా సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన మహిళలను చిన్న చూపు చూస్తు చేసిన వ్యాఖ్యలు,గిరిజన మహిళలను అవమానించే విధంగా ఉన్నాయని, మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. తక్షణమే ఒడిశా సీఎం గిరిజన మహిళలకు క్షమాపణ చేప్పాలని, లేనిపక్షంలో ఆదివాసీ మహిళలు ఏకమై రాస్తారోకోలు, ర్యాలీలు తదితర ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

రాజవొమ్మంగి: మండలంలోని గడుఓకుర్తి పంచాయతీ మాజీ సర్పంచ్ చలుమర్తి నాగేశ్వరరావు (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయనను రాజమండ్రిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సిరులు కురిపిస్తున్న పిప్పళ్లు



పిప్పళ్లను ఎండబెడుతున్న గిరిజన మహిళ



సంతలో పిప్పళ్లు అమ్మకాలు

- సంతల్లో గిరాకీ
- ప్రైవేట్ వ్యాపారులదే హవా
- నిలకడగా ధరలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని జీసీసీ అధికారులు



ఎండబెట్టిన పిప్పళ్లు

పెదబయలు: మన్యంలో గిరిజన రైతులు పండించిన పంటల్లో సిరుల పంటగా పిప్పళ్లకు పేరుంది. గత మూడేళ్ల నుంచి వారపు సంత మార్కెట్‌లో వీటికి ధర బాగుంది. మన్యంలో పసుపు తరువాత ఎక్కువగా సాగు చేసే పంటల్లో పిప్పళ్లు ఒకటి. మన్యంలో పండించే పిప్పళ్లకు మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా గిరాకీ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో పిప్పళ్లు కిలో రూ.310 నుంచి రూ.350 వరకు ధర ఉంది.ముద్ర రకం రూ.500 నుంచి రూ.900 వరకు ఉంది.దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పిప్పళ్లకు శీతల దేశాల్లో సుగంధ్ర ద్రవ్యాల తయారీకి ఎక్కువగా ఉపయోగిస్తారు.ఆయుర్వేద మందుల్లో ఎక్కువగా వినియోగిస్తారు. మన్యంలోనే చల్లటి ప్రాంతంలోనే పిప్పళ్ల సాగు జరుగుతుంది. అయితే ఈ పంటకు మార్కెట్ సదుపాయం అంతగా లేదు. మైదాన ప్రాంత వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేసిన పిప్పళ్లను శుద్ధి చేసి, గ్రేడింగ్ చేసిన అనంతరం ముంబాయి, కర్ణాటక, దుబాయ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. **రెండేళ్లకు ఒక్కసారి** తీసిన పిప్పళ్లు తక్కువ **ధర పలికితే.. మూడేళ్ల** పాటు భూమి నుంచి తీయకుండా ఉంచిన పిప్పళ్లు తరువాత తీసి గ్రేడింగ్ చేసి అమ్మకం చేస్తే రెట్టింపు ధరలు పలుకుతున్నట్టు రైతులు చెబుతున్నారు. గిరిజన రైతులు మాత్రం ఎలాంటి గ్రేడింగ్ చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసి గ్రేడింగ్ చేసి మార్కెటింగ్ చేసి మంచి ధర పొందుతున్నారు.

జీసీసీ కొనుగోలు చేయాలి

మన్యంలోని అరుదుగా పండే పంటల్లో పిప్పళ్ల పంటకు మార్కెట్ సదుపాయం లేదు. రాష్ట్రంలో విశాఖ మన్యంలోనే ఈ పంట ఎక్కువగా పండుతోంది. **దీనికి ప్రధాన మార్కెట్ వారపు సంతలే. సంత మార్కెట్ ధర నిర్ణయించేది ప్రయివేటు** వ్యాపారులే. ఎంతో శ్రమతో కూడుకున్న ఈ పంట మార్కెట్‌కు గిరి రైతులను ప్రభుత్వం ప్రోత్సాహిస్తే మరింత రైతులు లాభాల పొందుతారని పలువురు చెబుతున్నారు. ఈ పంటను నేరుగా జీసీసీ కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఎగుమతి చేస్తే మంచి లాభాలతో పాటుగా గిరిజన రైతులకు మార్కెట్ సదుపాయం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట కేవలం ప్రైవేట్ వ్యాపారుల కోసమే అన్నట్టుగా సాగుతుంది. పిప్పళ్ల పంటకు మార్కెట్ సదుపాయం కల్పిస్తే మంచి ఫలితాలు ఉంటుంది.

మార్కెట్ సదుపాయం కల్పించాలి



పిప్పళ్లకు మార్కెట్ సదుపాయం లేదు. మైదాన ప్రాంత వ్యాపారులు సంతల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.గిడ్డంగుల్లో నిల్వ చేసి ఎగుమతి చేసి మంచి ధర పొందుతున్నారు. జీసీసీ కొనుగోలు చేయక రైతులు నష్టపోతున్నారు. మార్కెట్ సదుపాయం కల్పిస్తే మా లాంటి రైతులకు మేలు జరుగుతుంది

– **ఎల్.భగీరథరావు**, రైతు, కుమ్మరివీధి గ్రామం, గోమంగి పంచాయతీ

అరుదైన పంటను కాపాడుకోవాలి



అరుదైన పిప్పళ్ల పంటకు మార్కెట్ సదుపాయం కల్పిస్తే గిరిజన రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం పిప్పళ్ల పంటను ప్రోత్సాహిస్తే గిరిజన రైతులు మరింతా ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించాలి.

– **మజ్జి చంద్రుబాబు**, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పెదబయలు

భూ దాతలకు న్యాయం చేయాలని డిమాండ్

- ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి సమస్య
- దీక్షకు మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురాం



మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురాం, నేతలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణాలకు భూములు ఇచ్చిన బాధితులకు నేటికి ఏడు సంవత్సరాలు కావస్తున్నా.. ఇప్పటి వరకు అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, తక్షణమే స్పందించి వారికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ఏకలవ్య భూ బాధితుల చేస్తున్న దీక్ష శిబిరానికి శనివారం వెళ్లి మద్దుతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ భూ బాధితులు సుమారు 16 రోజుల పాటు దీక్షతో పాటు వంటావార్పు చేసుకుంటున్నా అధికారులు స్పందిచకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను అరకులోయ ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు, టి.రాందాసు, రాంప్రసాద్, నాయకులు నరసింగరావు, గురునాయుడు, పూర్ణ, తుమ్‌నాథ్, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

నర్సీపట్నం: లక్ష ప్రమిదల దీపారాధన మహోత్సవం ఘనంగా జరిగింది. భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు భారీ ఎత్తున బాబాను దర్శించుకుని పూజలు చేశారు. శనివారం రాత్రి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 23వ లక్ష ప్రమిదల దీపారాధన వైభవంగా జరిగింది.

చోడవరం: చోడవరం శ్రీ కేశవస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవం, భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి పురవీధుల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు.

మాడుగుల రూరల్: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం రామాలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మన్యం బంద్ విజయవంతం చేయండి



స్పీకర్ వ్యాఖ్యలకు డుంబ్రిగుడలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాడేరులో మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు



ముంచంగిపుట్టు వారపు సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నేతలు

పాడేరు రూరల్: గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ మన్యంలో ఈనెల 11, 12 తేదీల్లో బంద్ నిర్వహించేందుకు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సన్నద్ధమయ్యాయి. ఈ సంఘం ఆయా సంఘాలు, ప్రజాప్రతినిధులు తదితరులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ మేరకు ఏజెన్సీ వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో చేపట్టనున్న బంద్‌కు అన్ని వర్గాల గిరిజనులు, ఆదివాసీలు మద్దతు తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాడేరులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజనులకు రక్షణగా ఉండే 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిను అనుచిత వాఖ్యలను వ్యతిరేకిస్తూ చేపట్టే బంద్‌లో గిరిజనలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలంటే కూటమి ప్రభుత్వానికి అంతా చులకన భావన ఎందుకని ప్రశ్నించారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు జరిగే మన్యం బంద్‌కు సంఘీభావంగా ఈనెల 10 నిర్వహించే బైక్ ర్యాలీలో గిరిజనులందరూ పాల్గొవాలని కోరారు. గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్, ఉపాధ్యక్షుడు లక్కు, నాయకులు పాల్గొన్నారు. మన్యం బంద్‌పై పాడేరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఏజెన్సీలో గిరిజన అభ్యర్థులతోనే ప్రభుత్వ శాఖల్లో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ముంచంగిపుట్టు: ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం బంద్‌పై విస్తృత ప్రచారం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, నాయకులు నర్సయ్య, భీమరాజు, గాసి రాందొర, నారాయణ, లైకోన్,జీనబంధు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఈనెల 11, 12 తేదీల్లో చేపట్టనున్న ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు గుజ్జెల చిరంజీవి, గణపతి, బాలరాజు మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అవహేళనగా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తక్షణమే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గూడెంకొత్తవీధి: మన్యం బంద్‌కు పీసా కమిటీలన్నీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు కమిటీ అధ్యక్షుడు కొర్రా బాలయ్య తెలిపారు. రాజకీయాలకతీతంగా గిరిజనం, అన్ని రాజకీయ పార్టీలూ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రంపచోడవరం: అఖిల పక్ష ప్రజా సంఘాల పిలుపు మేరకు ఈనెల 11,12 తేదీల్లో చేపట్టనున్న మన్యం బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ చెప్పారు. మన్యం బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి గిరిజనుడు ముందుకు వచ్చి బంద్‌లో పాల్గొవాలని పిలుపునిచ్చారు.

కూనవరం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 11, 12 తేదీల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ పిలుపునిచ్చారు. జగ్గవరంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అణగారిన ఆదివాసీ సంక్షేమ సమాజ అభ్యున్నతికి, వజ్రాయుధంగా ఉన్న 1/70 కి సవరణ చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు దారుణమన్నారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ మడకం నాగరాణి, సర్పంచ్‌లు కారం పార్వతి, సున్నం అభిరాం, నూపా వెంకన్నబాబు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, మడకం పూర్ణ, పెసా ఉపాధ్యక్షుడు కరక రాజ్‌కుమార్, కారం దారయ్య పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కూనవరంలోని సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు



రంపచోడవరంలో మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అరకు ఎమ్మెల్యేకు ఘన సన్మానం



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురాం, నేతలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం సేవలను ప్రశంసించారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పని **చేసి జగనన్నను ము**ఖ్యమంత్రిగా చేసుకునేందుకు **సమష్టిగా పనిచేస్తామ**న్నారు. మండల సర్పంచ్‌ల **ఫోరం అధ్యక్షుడు,** కంద్రుమ్ సర్పంచ్ కె.హరి, **మాజీ సర్పంచ్ రాం**ప్రసాద్, నాయకులు టి.రాందాస్, రఘు, తుమ్‌నాథ్, నరసింగరావు, గురునాయుడు, రాజారావు, రాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



దామనపల్లిలో విగ్రహ పత్రిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దేవీపట్నం: మండలంలోని దామనపల్లి గ్రామంలో **అభయ ఆంజనేయ**స్వామి విగ్రహ ప్రతిష్ఠ శని**వారం ఘనంగా నిర్వ**హించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. వనవాసీ ధర్మ రక్ష సమితి (రాజమహేంద్రవరం) విభాగం తరపున అమెరికాకు చెందిన పోన్నపల్లి రమేష్, దివ్య దంపతులు విగ్రహాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. గిరిజన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచార భక్త మండలి ప్రతినిధి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి దాతల సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేసిన సత్యనారాయణ

కొయ్యూరు: ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన గోకిరి శ్యాం ప్రకాశ్ కుటుంబానికి రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ శనివారం నిత్యావసర సరకులు, కొంత నగదును అందజేశారు.రాజేంద్రపాలెంకు చెందిన ప్రకాశ్ వారం కిందట క్యాన్సర్‌తో మృతి చెందారు. అతనికి తల్లిదండ్రులు లేరు..నాన్నమ్మ రాజులమ్మ ఇంటి వద్ద ఉండేవారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి దాతలు రత్నాజీ, సుధాకర్, వికాస్‌రెడ్డి, సత్యనారాయణతో కలిసి సాయమందించారు. వారు మాట్లాడుతూ దాతలు బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అశోక్‌లాల్, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాకలోనే అంగన్‌వాడీ కేంద్రం



దుప్పిలవాడ పంచాయతీ హరిపురంలో పాకలోనే కొనసాగుతున్న మినీ అంగన్‌వాడీ కేంద్రం

గూడెంకొత్తవీధి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. గూడెంకొత్తవీధి మండలంలోని దుప్పిలవాడ పంచాయతీలోని హరిపురంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఒక చిన్నపాకలో కొనసాగుతోంది. ఈ కేంద్రం పరిధిలోని సుమారు 30 మంది చిన్నారులు, బాలింతలు, గర్భిణులున్నారు. వీరంతా వసతి లేక గ్రామస్తులు ఏర్పాటు చేసిన పాకలోనే ఉంటున్నారు. సొంత భవనం నిర్మించాలని ఐసీడీఎస్ అధికారులు ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి రామాలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా హిందు ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం వరకు భజన ప్రచవన కార్యక్రమాన్ని చేపట్టింది. టీటీడీ పురాణ పండితుడు చల్లా సత్యనారాయణ, ప్రతినిధి పద్మరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి నెల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

జీడి రైతుల్లో కలవరం

- ప్రతికూల వాతావరణం
- మేఘాలు కమ్ముకోవడంతో పూతపై ప్రభావం



పూత దశలో ఉన్న జీడిమామిడి తోట

కొయ్యూరు: రెండు రోజులుగా మారుతున్న వాతావరణంతో జీడి రైతులు కలవరపడుతున్నారు.గడచిన మూడు సంవత్సరాల నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా జీడి రైతులు చాలా వరకు నష్టపోయారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడంతో వస్తున్న జీడిపూత మాడిపోతుందని భయపడుతున్నారు. మండలంలో 27 వేల ఎకరాల్లో జీడితోటలు విస్తరించి ఉన్నాయి.70 శాతం రైతులు జీడి పంటపైనే ఆధారపడి ఉన్నారు. ప్రస్తుతం జీడి పూత దశలో ఉంది. ఈ పది రోజులు దాటితే పిందె దశకు చేరుతుంది. అయితే వాతావరణంలో కారుమేఘాలు కమ్ముకోవడంతో పూత మాడిపోయి పాడైపోతుందన్న భయం రైతులను వెంటాడుతుంది. ప్రస్తుతం జీడికి ఎక్కువ వేడి వాతావరణం అవసరమని, దీంతో త్వరగా పిందె చేరుతుందని రైతులు చెబుతున్నారు. అయితే అందుకు భిన్నంగా ఉదయం సమయాల్లో పొగమంచు ఎక్కువగా కురవుడంతో పాటు తేమ ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఈ వాతావరణ పరిస్థితులు జీడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూచనలు, సలహాలు ఇవ్వాలి

హార్టీకల్చర్ అధికారులు ప్రస్తుత సమయంలో తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పూత పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలంటున్నారు. మండలంలో జీడి తోటలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ శాఖాధికారులు గ్రామాల్లో పర్యటించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం ఉదయం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రత్యేక కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణం జరిగింది. తొలి రోజు స్వామి వారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.